క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ



సీతానగరంలో ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రంజాన్ పండగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా 800 మంది ముస్లిం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీతానగరం, పెద వంగలపూడిల్లోని మసీదుల వద్ద డాక్టర్ బేగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ శాంతి, సోదర భావం, ఐకమత్యం, దాతృత్వానికి ప్రతీక రంజాన్ మాసం అన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఆరిఫ్ ఖాన్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఇబాదుల్లా ఖురేషి పాల్గొన్నారు.

రోగులకు వైద్య శిబిరం



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎం.ధనసాయిరెడ్డి, కె.సౌమ్య, సత్యం రమేష్‌బాబులు 114 మందికి వైద్య సేవలు అందించారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, హాస్పిటల్ జీఎం క్రాంతి కుమార్, ఏఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు 23న రాతపరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం రాతపరీక్ష నిర్వహించనున్నట్లు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఐదోతరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఏపీ.జీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఐదోతరగతి విద్యార్థులు, అలాగే ఏపీ.జీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్‌టీఈఆర్ వెబ్‌సైట్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వాణికుమారి సూచించారు.

ముగిసిన సువార్త సభలు

కడియం: మండలంలోని వేమగిరిలో చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన సువార్త సభలు శుక్రవారం ముగిశాయి. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ నాయకులు వెలుగుబంటి రఘురామ్, గుత్తుల ముత్యం, జోగి చక్రవర్తి, గుత్తుల శేషగిరి, కాండ్రేగుల సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన శ్రీనివాస్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

నేడు పుస్తకావిష్కరణ

సీటీఆర్ఐ: ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన క్రొత్త గోదావరి పుస్తకావిష్కరణ కార్యక్రమం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీహాల్లో శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని సాహితీ గౌతమీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఓఎన్‌జీసీ జీఎం పి.విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పురస్కారగ్రహీత, మహోమహోపాధ్యాయులు డాక్టర్ సముద్రాల రంగరామానుజాచార్యులు, ఆచార్యులు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, సాహితీ గౌతమి కార్యదర్శి దినవహి బాపిరాజు పాల్గొంటారన్నారు.

నూరుశాతం రేషన్ పంపిణీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డులకు వెళ్లినప్పుడు చాలామంది ప్రజలు తమకు రేషన్ అందడం లేదని చెబుతున్నారని, ఇది చాలా బాధాకరమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని శ్రీనివాస రౌతు తాతాలు కల్యాణ మండపంలో రేషన్ డీలర్లకు, ఎండీయూ వాహన ఆపరేటర్లకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం, పంచదార, పప్పు చాలామంది సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మానవతా దృక్పథంతో లబ్ధిదారులందరికీ రేషన్ నూరుశాతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యావసర వస్తువుల సరఫరాలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా సహించేది లేదని స్పష్టం చేశారు.

భూసారం.. తెలిస్తే బంగారం

- రెండు నియోజకవర్గాల్లో భూసార పరీక్షలకు చర్యలు
- తద్వారా పంటలకు మేలు



దోమాడలో మట్టి నమునాలు సేకరిస్తున్న ఏఓ మణిదీప్ (ఫైల్)

పెదపూడి: ప్రజల ఆకలి తీర్చేవి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలే.. అలాంటి భూముల్లో బంగారం పండించాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి.. తద్వారా ఆ భూమిలో పోషకాలు, ఆమ్ల, క్షార స్థితి, చౌడు, ఇతర లోపాలు తెలుస్తాయి. అప్పుడు సిఫారసు చేసిన ఎరువులు వాడటంతో ఎరువులపై అనవసరమైన వ్యయం తగ్గుతుంది. భూమి సేద్యానికి అనువుగా లేని పక్షంలో ఎలా బాగు చేసుకోవాలో.. దానికి ప్రత్యామ్నాయంగా ఏ రసాయనాలు ఎంత మేర వాడాలో తెలుస్తుంది. దీనివల్ల సాగులో సిరులు పండించొచ్చు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అనపర్తి మండలంలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరం మండలంలో 1,917 ఎకరాలు, రాజానగరం మండలంలో 8,060 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో కోతలు జరుగుతున్నాయి. అనపర్తి, బిక్కవోలు మండలాల్లో దాదాపు కోతలు పూర్తయ్యాయి. వచ్చే ఖరీఫ్ నాటికి భూమిని సిద్ధం చేసేందుకు భూసార పరీక్షలు తప్పనిసరి అని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే అధికారులు పెదపూడి మండలంలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు.

ఎలా సేకరిస్తారంటే.. : భూసార పరీక్షలకు పొలంలో మట్టి నమూనాలను సేకరించాల్సి ఉంటుంది. వ్యవసాయ భూముల్లో ఆరు అంగుళాలు లేక 15 సెంటీమీటర్ల లోతులో వీ ఆకారంలో గొయ్యి తీస్తారు. పండ్ల తోటలకు 5 అడుగుల గొయ్యి తవ్వి అడుగుకి ఒకటి చొప్పున 5 నమూనాలు సేకరిస్తారు. వాటిని భూసార పరీక్షలకు ల్యాబ్‌కు పంపుతారు. అనంతరం వచ్చే రిపోర్టుల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచనలతో సాగులో సమతుల్య పోషక పదార్థాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఆరు రకాల పరీక్షలు

సేకరించిన మట్టి నమూనాలకు భూసార పరీక్ష కేంద్రంలో ఆరు రకాల పరీక్షలు చేస్తారు. నేల స్వభావం, లవణాల సాంద్రత, ఆమ్ల క్షార లక్షణం, సేంద్రియ కర్బనం, లభ్య భాస్వరం, లభ్య పొటాష్ పరీక్షలు చేసి తద్వారా రైతులకు సూచనలు చేస్తారు.

భూమిలో లోపాలను గుర్తించడం ద్వారా ఎరువులను సమర్థవంతంగా, పొదుపుగా వినియోగించుకోవచ్చు. దీనివల్ల భూసారాన్ని కాపాడుకోవచ్చు.

విస్తృతంగా నమూనాల సేకరణ



పంటల సాగులో భూసార పరీక్షలు చేయడంతో ఆ భూమి ఎంత మేర సారవంతంగా ఉందో తెలుస్తుంది. పోషకాలు ఎలా ఉన్నాయో తెలుసుకుని దాని ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. భూమిని సారవంతంగా తయారు చేసుకోవచ్చు. దీంతో తక్కువ వ్యయంతో అధిక పంట దిగుబడి పెరుగుతుంది. మండలంలో భూసార పరీక్షలు విస్తృతంగా చేస్తున్నాం.

–టీవీఆర్ మణిదీప్,
మండల వ్యవసాయాధికారి,
పెదపూడి

జుమ్మా మసీదులో ఇఫ్తార్ విందు



గోకవరం మసీదులో ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని జుమ్మా మసీదులో ముస్లింలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత మసీదులో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకటరమణ, ఎస్సై యువి శివనాగబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, చంటిసాహెబ్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సీతానగరం: సింగవరం ఏటిగట్టుపై ఉన్న సిద్ధి వినాయక, అభయాంజనేయస్వామి దేవాలయాల వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిశెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాహన చోదకులు, ప్రజలకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అచ్చుతాపురత్రయంలో గడప గడపకూ..



అచ్చుతాపురత్రయంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అర్హులందరికీ పథకాలు అందిస్తూ సంక్షేమ సారథిలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనత సాధించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అచ్చుతాపురత్రయంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పథకాల అమలులో దేశంలోనే రాష్ట్రం ఆదర్శవంతంగా నిలిచిందని కొనియాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన మనసున్న ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల ఇంటికే పథకాలు అందజేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యులు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ అడబాల అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, సొసైటీ చైర్మన్ గుండా ఈశ్వరరావు, కర్రి సత్యనారాయణ, పార్టీ గ్రామ కన్వీనర్ పి.వీరన్న, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



మర్రిపూడిలో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న గృహ సారథులు, నాయకులు

రంగంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమానికి వస్తున్న ఆదరణే దానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని వడిశలేరు, కోటపాడు, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, పెదరాయవరం గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలను సేకరించారు. ఇంటి గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. అనంతరం బ్రోచర్లను అందించారు. నాయకులు కొల్లాటి ఇజ్రాయేలు, నలమాటి భీముడు, గవరసాని రాజు, వేము చిరంజీవి, నల్లా దుర్గాప్రసాద్, గోలి రమణ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే మోదీ ధ్యేయం



మధురపూడిలో మాట్లాడుతున్న పురందేశ్వరి

మధురపూడి: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పాలన సాగుతోందని, మరోసారి బీజేపీకి, మోదీకి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కోరుకొండ మండలం మధురపూడిలో శుక్రవారం జరిగిన బీజేపీ వాల్ పెయింటింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీ వర్గాల్లోని మహిళలకు హక్కులు కల్పించిన ఏకైక ప్రభుత్వంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాల ద్వారా ముందుకు సాగుతోందన్నారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించి ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో పెయింటింగ్ చేశారు. ప్రతి పల్లెకు బీజేపీ సంక్షేమ పాలనను చేరువ చేయాలన్న లక్ష్యంతో వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అఖిల భారత కార్యదర్శి వై.సత్యకుమార్ యాదవ్, పార్టీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ ఏపీఆర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, అడబాల గణపతి, కోరుకొండ మండల కన్వీనర్ నీలపాల వెంకన్న పాల్గొన్నారు.

త్వరలో ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ..



నిడిగట్లలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: నియోజకవర్గంలో రూ.220 కోట్లతో చేపట్టే వాటర్ గ్రిడ్ పథకం ద్వారా త్వరలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించానని, దానిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సంబంధిత మంత్రులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. త్వరలో ప్రభుత్వం జీవోను విడుదల చేసి నిధులు మంజూరు చేస్తుందన్నారు. గోదావరి జలాలను పురుషోత్తపట్నం వద్ద సేకరించేందుకు చర్యలు మొదలయ్యాయన్నారు. నీటి సరఫరాకు అనువైన ఎత్తయిన ప్రదేశాల్లో పెద్ద ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపుల నిర్మాణం చేపడతామన్నారు. దీనికి సంబంధించిన సర్వే పనులు జరుగుతున్నాయన్నారు.

పథకాల అమలుపై ఆరా

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన జక్కంపూడి రాజాకు పార్టీ నాయకులు మోటారు సైకిళ్ల ర్యాలీ ద్వారా భారీ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 300 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. గ్రామంలో రూ.కోట్లతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ నిర్మించామన్నారు.

కోటికేశవరంలో నాడు–నేడు పథకంలో ఆధునికంగా తీర్చిదిద్దిన పీహెచ్‌సీని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజని ఈనెల 24న ప్రారంభిస్తారన్నారు. సీతానగరం మండలం బొబ్బిల్లంకలో పీహెచ్‌సీకి శంకుస్థాపన చేస్తారని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరంగపట్నంలోని ముగ్గురు కళాకారుల కుటుంబాలకు రెండు లక్షలు చొప్పున, క్షతగాత్రులకు లక్ష రూపాయలు చొప్పున సహాయాన్ని అందించనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

నిడిగట్లలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన 40 మంది వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.

ట్రాక్టర్, రోటోవేటర్ అందజేత

వైఎస్సార్ యంత్రసేవ పథకంలో భాగంగా ట్రాక్టర్, రోటోవేటర్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, దూలం పెద్ద, నాయకులు వేమగిరి కృష్ణ, గంగిశెట్టి సోమేశ్వరరావు, యడ్ల సత్యనారాయణ, గంగా సురేష్, కోలం రాజా రమాదేవి పాల్గొన్నారు.

పగలు... సెగలు

- ఎండ నుంచి రక్షణ చర్యలు తప్పనిసరి
- లేకుంటే ఆరోగ్యంపై ప్రభావం



డాక్టర్ టి.రాముగురెడ్డి

అనపర్తి: సూరీడు నెత్తిన నిప్పులు కురిపిస్తున్నాడు.. బయటకు వెళ్తే చాలు భగభగలు రేపుతున్నాడు.. ఉదయం 9 గంటల నుంచే తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సగటు జీవి అల్లాడుతున్నాడు. అనపర్తి నియోజకవర్గంలో ప్రతి రోజూ 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సోమవారం 40, మంగళవారం 41, బుధవారం 40, గురువారం 39, శుక్రవారం 40 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనివల్ల నిత్యం రద్దీగా ఉండే అనపర్తిలోని ప్రధాన దారులు 12 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోడ్లపై దుకాణాలను 1 గంటకు మూసివేసి సాయంత్రం ఎండ వేడి తగ్గాక తెరుస్తున్నారు. దీనిని బట్టి చూస్తే పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే అర్థమవుతోంది. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రాముగురెడ్డి సూచించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా..

ఇలా చేస్తే మంచిది

ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతి ఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. వేసవి తాపానికి శరీరంలో నీటి శాతం తగ్గి వడదెబ్బతో పాటు వివిధ రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఎండ కారణంగా వడదెబ్బకు గురవకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. దీనిద్వారా డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. తాజా పండ్లను అధికంగా తీసుకోవాలి. రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా తలకు రక్షణగా టోపీలు, ముక్కుకు మాస్కులు ధరించాలి. చిన్నారులు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం కూలీలు వడదెబ్బ బారిన పడకుండా నిర్దేశిత సమయానికి పనులు ముగించుకోవాలి. తెలుపు రంగు, పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలి. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలపై ప్రజలు చైతన్యం పొందాలి.



అనపర్తిలో ప్రధాన రహదారి ఇలా..

రేపు గణపతి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: చంద్రేడులో గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఉంటుంది.

మసీదులకు రంజాన్ శోభ

వేడుకలకు సర్వం సిద్ధం



పందలపాకలో మసీదు

అనపర్తి: ముస్లింల రంజాన్ మాసం ఉపవాస దీక్షలు శనివారంతో ముగుస్తున్నాయి. దీంతో నెలవంక దర్శనం కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. రంజాన్ పండుగ సమయం ఆసన్నం కావటంతో నియోజకవర్గంలోని మసీదులను సుందరంగా ముస్తాబు చేశారు. ఈ పండుగను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. రంజాన్ మాసంలో ఖురాన్ గ్రంథ పఠనం చేస్తే 70 రెట్లు పుణ్యం లభిస్తుందని ముస్లింల విశ్వాసం. ఉపవాసాలు మానవుల్లో దైవభీతిని పెంపొందించటంతో పాటు పరిపూర్ణ నీతివంతుడిగా తీర్చిదిద్దబడతారని, అదేవిధంగా ఖురాన్‌లోని ఐదు ధర్మాలను పాటిస్తూ చేపట్టిన దీక్షలు, నియమాలు ఏడాది పాటు సత్ఫలితాలు కలుగజేస్తాయన్నది పెద్దల మాట. అనపర్తి బాబానగర్‌లో ముఖరం మసీదు, పాత ఊరులోని అంజుమాన్ నూర్ ఇస్లాం మసీదు, కుతుకులూరు, బిక్కవోలు మండలం బలభద్రపురం, బిక్కవోలు, పందలపాక, పెదపూడి మండలం సంపర, పెద్దాడ, మామిడాడ, రంగంపేట మండలం సుభద్రంపేట, సింగంపల్లి, ముకుందవరం గ్రామాల్లో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ప్రార్థనలకు సర్వం సిద్ధం

బిక్కవోలు: రంజాన్‌ను పురస్కరించుకుని శనివారం జరిగే ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. ముస్లింలకు అత్యంత ప్రధానమైన పండుగ రంజాన్. మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ ఈ మాసంలోనే అవతరించింది. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని పలు మసీదుల్లో శనివారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక నమాజులు జరుగనున్నాయి. అనంతరం పేదలకు దానాలు చేయనున్నారు. ఆకలి విలువ తెలియజేసేదే రంజాన్ ఉపవాస దీక్ష అని పందలపాక జామియా మసీద్ గురువు మౌలానా షేక్ గులాం గౌస్ రిజ్వీ అన్నారు. పేదలకు ప్రతి ముస్లిం చేతనైన సహాయం చేయాలన్నారు. మనతో పాటు ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలనేదే దీని ఉద్దేశమన్నారు.

బీసీ మహిళా సంఘం కన్వీనర్‌గా డాక్టర్ పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ బీసీ మహిళా సంక్షేమ సంఘం కన్వీనర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనసూరి పద్మలత నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కాగా.. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.